# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 09-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు ఒడిశాలో పర్యటించనున్నారు.
- దేశాభివృద్ధిలో ప్రవాస భారతీయులు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు.
- ప్రయాగ్ రాజ్ లో మహా కుంభ మేళాకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి.
- నూతన బడ్జెట్ లో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.
- ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం శబరిమలను 1,033 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయనున్నారు.

==========================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు ఒడిశాలో పర్యటించనున్నారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్ లో జరిగే 18వ ప్రవాసి భారత్ దివస్ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొంటారని అధికార వర్గాలు తెలిపాయి. కాగా, ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ కార్యక్రమాలను ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. పలువురు కేంద్ర మంత్రులు రాష్ట్ర మంత్రులతో పాటు 50 దేశాలకు చెందిన ప్రవాస భారతీయులు 18వ ప్రవాసి భారత్ దివస్ కు హాజరయ్యారని అధికార వర్గాలు తెలిపాయి.

==========================

ప్రపంచానికి దేశం తరఫున రాయబారులుగా ప్రవాస భారతీయులు విశేష సేవలందిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన 18వ ప్రవాసి భారతీయ దివస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈ రోజు ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... దేశాభివృద్ధిలో ప్రవాస భారతీయుల సహకారం మరువలేనిదని అన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ను మార్చడంలో

భారతీయ ప్రవాసుల కీలక పాత్రను పోషిస్తున్నారని గుర్తు చేశారు. భారతీయ విలువలను ప్రపంచంలో నిలబెడుతున్నారని నరేంద్ర మోడీ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

ఇదిలా ఉండగా, ప్రవాసీ భారతీయ టూరిస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధానమంత్రి రిమోట్ విధానంలో జెండా ఊపి ప్రారంభించారు.

============================

ఉత్తరప్రదేశ్ ప్రయాగ రాజ్ లో ఈ నెల 13వ తేదీ నుండి మొదలు కాబోతున్న "మహా కుంభ మేళా"కు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ప్రయాగ్‌రాజ్‌లోని గంగా, యమునా, సరస్వతి నదుల సంగమం వద్ద మహా కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు జరగనుంది. ఈ సంవత్సరం కుంభమేళాకు దేశ, విదేశాల నుండి దాదాపుగా 45 కోట్ల మంది భక్తులు సందర్శకులు వస్తారని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. సాధారణ భక్తుల మొదలుకుని పలు రంగాలకు చెందిన ప్రముఖులు కూడా మహా కుంభ మేళాకు తరలి రానున్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. భక్తుల కోసం భద్రతా ఏర్పా ట్లు చేశారు. రవాణా, ట్రాఫిక్, రద్దీ నిర్వహణ, విస్తృత భద్రత కోసం ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను ఇతర రాష్ట్రాల నుంచి రప్పించి అక్కడ బాధ్యతలు కేటాయించారు. కాగా, ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే మహాకుంభ మేళ దేశంలో జరిగే అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమంగా ఉంటుంది.

============================

కేరళలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం శబరిమలను ఒక వెయ్యి 33 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయనున్నారు. దీనికి సంబంధించిన బృహత్తర ప్రణాళికను కేరళ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. సన్నిధానం, పంపా, ట్రక్ రూట్ వంటి కీలక ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి నమూనా పత్రం రూపొందించారు. మొత్తం 778.17 కోట్ల రూపాయల వ్యయంతో సన్నిధానం ప్రాంతాన్ని 3 దశల్లో అభివృద్ధి చేయనున్నారు. మొదటి దశ పనులకు 600 కోట్ల రూపాయలు, 2028-2033 మధ్య చేపట్టనున్న 2వ దశ పనులకు రూ. 100 కోట్ల రూపాయలు, 2034-39 మధ్య చేపట్టనున్న 3వ దశ పనులకు రూ.77.68 కోట్ల రూపాయలు కేటాయించనున్నారని ఆ రాష్ట్ర అధికార వర్గాలు తెలిపాయి.

============================

కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఢిల్లీలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో "మహా కుంభ మేళా"కు సంబంధించి అంకితం చేసిన ఆకాశవాణి దూరదర్శన్ ప్రత్యేక పాటలను ప్రారంభించారు. ఆకాశవాణి ప్రత్యేక కూర్పు సంగీతం రచనతో కూడిన ఈ గీతాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. మహాకుంభ మేళా ఆధ్యాత్మిక, సాంస్కృతిక విశిష్టతను ఈ గీతాలు తెలియచేసేలా రూపొందించారు. ఈ కార్యక్రమంలో ప్రసార భారతి చైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్, ప్రసార భారతి ముఖ్య కార్యనిర్వహణాధికారి గౌరవ్ ద్వివేది, దూరదర్శన్ డైరెక్టర్ జనరల్ కంచన్ ప్రసాద్, ఆకాశవాణి న్యూస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రజ్ఞా పలివాల్ గౌర్ తదితరులు పాల్గొన్నారు. కాగా మహాకుంభ మేళా ఈ నెల జనవరి 13 నుండి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతుంది.

విరామం

============================

భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ఈ రోజు నిర్వహించాల్సిన అనుసంధాన ప్రక్రియను మరోసారి వాయిదా వేసింది. తొలుత ఈ నెల 7వ తేదీనే అనుసంధాన ప్రక్రియను నిర్వహించాలని ఇస్రో భావించింది. తాజాగా రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 225 మీటర్లకు చేర్చేందుకు ఓ పక్రియ నిర్వహించగా, రెండింటి మధ్య దూరం ఊహించిన దాని కంటే ఎక్కువ ఉన్నట్లు తేలింది. దీంతో ఈరోజు నిర్వహించాలనుకున్న అనుసంధాన ప్రక్రియను వాయిదా వేశామని ఇస్రో సమాజిక మాధ్యమం వేదికగా వెల్లడించింది.

===========================

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఈరోజు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారని, ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లుగా సుక్మా ఎస్పీ కిరణ్ చావన్ పాత్రికేయులకు  తెలిపారు. కాగా, మూడు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు పోలీసుల  వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మందుపాతరతో పేల్చేశారు. ఈ ఘటనలో 8 మంది సైనికులు, డ్రైవర్ అక్కడిక్కడ చనిపోయారు. మరో ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయని పోలీసు వర్గాలు తెలిపాయి.

===========================

నూతన బడ్జెట్ లో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని కేంద్ర వ్యవసాయం రైతుల సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆయన సమావేశమై కేంద్ర బడ్జెట్ కి సంబంధించి అనేక అంశాలపై చర్చించారు. ఈ సమావేశం అనంతరం శివరాజ్ సింగ్ చౌహాన్ పాత్రికేయులతో మాట్లాడుతూ... వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, భూ వనరుల వంటి శాఖలకు బడ్జెట్ లో ప్రాధాన్యత గురించి కేంద్రమంత్రితో చర్చించామని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

===========================

దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంవత్సరం జరిగే గణతంత్ర వేడుకలను తిలకించేందుకు దాదాపుగా 10 వేల మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానిస్తున్నామని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ప్రత్యేక అతిథులలో సర్పంచ్‌లు, విపత్తు సహాయ కార్యకర్తలు, ఉత్తమ పనితీరు కనబరిచిన నీటి యోధులు, చేనేత హస్తకళా కళాకారులు, మన్ కీ బాత్ లో పాల్గొనేవారు, మై భారత్ వాలంటీర్లు, ఈశాన్య రాష్ట్రాల నుండి వచ్చిన అతిథులు ఉన్నారని పేర్కొంది. ఈ అతిథులు ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్, PM సంగ్రహాలయ్ ఇతర ప్రముఖ ప్రదేశాలను కూడా సందర్శిస్తారని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

===========================

దేశంలో క్షయవ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. క్షయవ్యాధి నిర్మూలన కోసం వంద రోజుల పాటు దేశవ్యాప్తంగా అతి పెద్ద ప్రచారాన్ని నిర్వహించాలని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. ఈ మేరకు అవసరమైన ప్రాంతాలలో స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహించాలని పేర్కొంది. అదే విధంగా అన్ని కారాగాల్లో క్షయవ్యాధికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరింది. ఈ నెల 27 నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖతో కలసి క్షయ నిర్మూలన ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని కూడా చేపట్టాలని పేర్కొంది.

===========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 78,148 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 528.28 పాయింట్ల నష్టంతో 77,620 వద్ద ముగిసింది. నిఫ్టీ 162.45 పాయింట్ల నష్టంతో 23,526 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 3 పైసలు క్షీణించి 85.88గా ఉంది.

===========================

===========================